# రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



8లో...

కరీంనగర్ వార్త
కరీంనగర్ - జగిత్యాల - పెద్దపల్లి - రాజన్నసిరిసిల్ల
శనివారం 2 డిసెంబర్ 2023 8 పేజీలు

## సింగరేణిలో మొదలు కానున్న
# ఎన్నికలు

- 27వ తేదిన ఎన్నికలకు సిద్ధమవుతున్న కార్మిక సంఘాలు
- 4వ తేదిన ఆర్ఎల్‌సి కార్యాలయంలో సమావేశం
- కార్మిక సంఘాల నాయకులతో సమావేశం కానున్న రిటర్నింగ్ అధికారి
- కార్మికుల ఓటర్ల జాబితా ఇచ్చే అవకాశం



**గోదావరిఖని, ప్రభాతవార్త:** సింగరేణి కాలరీస్ సంస్థలో ఈ నెల 27వ తేదిన ఎన్నికలకు కార్మిక సంఘాల నాయకులు సిద్ధమవుతున్నారు. 2017వ సంవత్సరం అక్టోబర్ నెలలో ఎన్నికలు జరిగాయి. ఆ తరువాత జరగాల్సిన ఎన్నికలు వరుసగా వాయిదాలు పడుతున్నాయి. ఎన్నికల సమయంలో స్పష్టమైన కాలపరిమితి లేని కారణంగా రెండు సంవత్సరాల కాలమని కార్మిక శాఖ అధికారులు అంతకు ముందు కొనసాగిన విధంగా నాలుగు సంవత్సరాల కాలపరిమితి కావాలని, గెలిచిన టిబిజికెఎస్ సంఘం నాయకులు వాధించారు. ఆ తరువాత 2021వ సంవత్సరంలో జరగాల్సిన సింగరేణి ఎన్నికలు వరుసగా వాయిదా పడుతున్నాయి.

2 లో..

## స్ట్రాంగ్ రూంలకు ఈవిఎం యంత్రాల తరలింపు పూర్తి

### కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్



**రామగిరి–ప్రభాతవార్త:** స్ట్రాంగ్ రూమ్ లకు ఈవిఎం యంత్రాల తరలింపు పూర్తయిందని కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. శుక్రవారం రామగిరి మండలంలోని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రం స్ట్రాంగ్ రూమ్ లలో యంత్రాల తరలింపు ప్రక్రియను రామగుండం అసెంబ్లీ నియోజకవర్గ సాధారణ పరిశీలకులు రాజేష్ సింగ్ రాణా, పెద్దపల్లి, మంథని అసెంబ్లీ నియోజకవర్గ సాధారణ పరిశీలకులు శ్రీధర్ లతో కలిసి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంథని అసెంబ్లీ నియోజకవర్గంకు సంబంధించిన ఈవిఎం యంత్రాలను గురువారం రాత్రి స్ట్రాంగ్ రూమ్ లలో భద్రపరిచామని, పెద్దపల్లి, రామగుండం అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవిఎం యంత్రాలను శుక్రవారం ఉదయం స్ట్రాంగ్ రూమ్ లకు తరలించి భద్రపరిచామని కలెక్టర్ తెలిపారు.

2 లో..

## ఎయిడ్స్‌పై అవగాహనతో ప్రజలలో చైతన్యం కలిగించాలి

### సీనియర్ సివిల్ జడ్జి ఎం.అర్జున్




8లో...

## కౌంటింగ్ సెంటర్ వద్ద
# పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు

### పోలీస్ కమీషనర్ అభిషేక్ మహంతి

**కరీంనగర్ క్రైమ్,ప్రభాతవార్త:** కరీంనగర్ కమీషనరేట్‌లో కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం అన్ని పోలీస్ స్టేషన్‌ల, వివిధ విభాగాలకు చెందిన అధికారులందరితో పోలీస్ కమీషనర్ అభిషేక్ మహంతి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ మాట్లాడుతూ.. కమిషనరేట్ వ్యాప్తంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్ ప్రక్రియ ముగిసిందని ఆయన అన్నారు. పటిష్టమైన ప్రణాళిక, క్రమశిక్షణతో అధికారులందరూ పనిచేయడం వల్లే ఇది సాధ్యమైందన్నారు.




2లో...

# సింగరేణిలో మొదలు కానున్న ఎన్నికలు

మొదటి పేజీ తరువాయి..

ఈ వాయిదాలతో విసుగు చెందిన ఒక జాతీయ కార్మిక సంఘం రాష్ట్ర హైకోర్టును కూడా ఆశ్రయించారు. దరిమిలా రాష్ట్ర హైకోర్టు కూడా రంగ ప్రవేశం చేయాల్సి వచ్చింది. హైకోర్టు ఆదేశాల ప్రకారం ఎన్నికల షెడ్యూల్డ్ వెల్లడించినప్పటికీ కొన్ని కార్మిక సంఘాలు సహకరించక పోవడం తిరిగి ఎన్నికల నిర్వహణ కోసం ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయని వాధనలు, ప్రతివాధనలు జరుగుతున్న సమయంలో రాష్ట్ర శాసన సభ ఎన్నికల కోసం భారత ఎన్నికల కమీషన్ రాష్ట్రంలో ఎన్నికల షెడ్యూల్డ్ ప్రకటించారు. తప్పనిసరి పరిస్థితులలో కొన్ని రోజుల సమయం పెంచి డిసెంబర్ 27వ తేదీన సింగరేని ఎన్నికలు నిర్వహించాలని షెడ్యూల్డ్ ప్రకటించారు. కేంద్ర, కార్మిక శాఖ అధికారుల సూచనల మేరకు అప్పటికే ఎన్నికల ప్రక్రియలో ఉన్న ఎన్నికలు కొంత కాలం పెంచి ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. ఈ నెల 27వ తేదీన ఎన్నికలు నిర్వహించాలని అప్పటికే ప్రక్రియలో ఉన్న నిబంధనల ప్రకారం నామినేషన్ల ఘట్టం కొనసాగుతుందని, ఇప్పుడు కేవలం కార్మికుల ఓటర్ల జాబితా కార్మిక సంఘాల నాయకులకు అందజేశారు. ఆ ప్రక్రియ ప్రకారం కార్మిక సంఘాలకు కేటాయించిన గుర్తులు కూడా అలాగే కొనసాగిస్తారు.



ఈ మేరకు 4వ తేదీ సోమవారం నాడు సింగరేణి ఎన్నికల నిర్వహణ కోసం నియమించిన శ్రీనివాసన్ అనే కార్మిక శాఖ అధికారి ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహిస్తారు. నాల్గవ తేదీన కార్మిక సంఘాల నాయకులకు ఇప్పటికే ఆహ్వానాలు పంపించారు. కార్మిక నాయకులు సైతం సమావేశంలో పాల్గొనడానికి సిద్ధమవుతున్నారు. మొత్తం 13కార్మిక సంఘాలకు ఈ సమావేశంకు ఆహ్వానిస్తున్నారు. సమావేశం అనంతరం సింగరేణి ఎన్నికల ప్రక్రియ ప్రారంభం అవుతుందని, సింగరేణిలో ఇప్పటికే కార్మిక సంఘాలు నాయకులు ఎన్నికల కోసం సమాయత్తం అవుతున్నారు. ప్రస్తుత శాసన సభ ఎన్నికల ఫలితాలు ఎలా ఉన్నప్పటికీ సింగరేణిలో ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయి.

# కౌంటింగ్ సెంటర్ వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు





మొదటి పేజీ తరువాయి..

కమిషనరేట్ వ్యాప్తంగా అన్ని స్థాయిలకు చెందిన అధికారులు పోలింగ్ ప్రక్రియ ముగిసే వరకు ఎంతో అప్రమత్తంగా ఉంటూ వారికి కేటాయించబడ్డ విధులు సక్రమంగా నిర్వహించారన్నారు. దీనికిగాను అన్ని విభాగాలకు చెందిన అన్ని స్థాయిలకు చెందిన అధికారులందరినీ ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం మాట్లాడుతూ.. పోలింగ్ ప్రక్రియ ముగిసినప్పటికీ, పోస్ట్ పోలింగ్ ఇంకా మిగిలి ఉందని అధికారులు, సిబ్బంది గుర్తించాలన్నారు. డిసెంబర్ 3వ తేదీన ఎన్నికల కమీషనర్, ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించిందన్నారు. దీనికిగాను కరీంనగర్‌లోని నాలుగు నియోజకవర్గలయిన కరీంనగర్, చొప్పదండి, మానకొండూర్, హుజూరాబాద్‌లకు చెందిన ఈవీఎంలను ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు స్ట్రాంగర్ రూమ్‌లు ఏర్పాటు చేసి వాటిని అవసరమైన భద్రత కలిపించామన్నారు. ఇదే కళాశాల నందు నియోజకవర్గాల వారిగా కౌంటింగ్ సెంటర్‌లను ఏర్పాటు చేశామన్నారు. స్ట్రాంగ్ రూముల భద్రతకై కేంద్ర సాయుధ బలగాలని కేటాయించమన్నారు. కౌంటింగ్ రోజున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా, ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు విఘాతం కలగకుండా కట్టుదిట్టమైన పటిష్ట బందోబస్తీ ప్రణాళిక సిద్ధం చేశామని, అవసరమైన అన్ని భద్రతా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఓటింగ్ ప్రక్రియ ముగిసే వరకు అధికారులంతా అప్రమత్తంగా ఉంటూ విధుల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. విధుల్లో ఎటువంటి ఆలసత్వం ప్రదర్శించవద్దన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ కూడా ప్రశాంతంగా ముగిసేలా నిబద్ధతతో విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ఏ.లక్ష్మీనారాయణ(శాంతి భద్రతలు), సి.రాజు(పరిపాలన), ఏసీపీలు నరేందర్(టౌన్), కరుణాకర్‌రావు(రూరల్), జీవన్ రెడ్డి(హుజూరాబాద్), శ్రీనివాస్(సిఎస్‌బి), సర్వర్(ట్రాఫిక్), విజయ్ కుమార్((సీసీఆర్‌బి/ఎలక్షన్స్ సెల్), కాశయ్య(ఐటీ సెల్), మాధవి(సిసిఎస్), వేణు(సిటిసి), ప్రతాప్(ఎఆర్), అన్ని పోలీస్ స్టేషన్‌లకు చెందిన ఎస్‌హెచ్ఓలు, హెడక్వార్టర్స్‌కి చెందిన ఆర్ఐలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# స్ట్రాంగ్ రూంలకు ఈవిఎం యంత్రాల తరలింపు పూర్తి

మొదటి పేజీ తరువాయి..

ఈవిఎం యంత్రాలు స్ట్రాంగ్ రూంకు తరలింపు ప్రక్రియ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జరిగిందని ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం పారదర్శకంగా యంత్రాలను తరలించామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారులు జే.అరుణశ్రీ, సిహెచ్.మధుమోహన్, వి.హనుమానాయక్ సంభందిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.







## రామగుండంలో, రాష్ట్రంలో గెలిచేది బిఆర్ఎస్ పార్టీ

### - బిఆర్ఎస్ రామగుండం అభ్యర్థి కోరుకంటి చందర్



**గోదావరిఖని, ప్రభాతవార్త:** రామగుండం నియోజక వర్గంలో ప్రజల ఆశీస్సులతో బిఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తల నిర్విరామ కృషితో తిరిగి తానే ఎమ్మెల్యేగా గెలువబోతున్నానని, రానున్న అయిదేళ్లలో ప్రజలకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తానని, మరింత మెరుగైన సేవలందిస్తానని బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కోరుకంటి చందర్ అన్నారు. స్థానిక ప్రధాన చౌరస్తా సమీపంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు దాదాపు రెండు నెలల పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటింటికి, గడప గడపకు తీసుకెళ్లడంలో సఫలీకృతులయ్యారని, తన గెలుపే లక్ష్యంగా కృషి చేశారని కృతజ్ఞతలు తెలిపారు. రామగుండం నియోజక వర్గం చైతన్యానికి మారు పేరని, ఉద్యమకారులను కన్న గడ్డ అని, తనను అక్కున చేర్చుకున్న నేల అని, 2018లో తనకు ఎమ్మెల్యేగా సేవ చేసే గొప్ప అదృష్టం, అవకాశమిచ్చిన ప్రజల కోసం రోజులో 18 గంటలు, సంవత్సరంలో 350 రోజులు వారి సౌకర్యాల కల్పనలోనే, వారి సేవలోనే గడిపానని అన్నారు. ప్రజలను మభ్య పెట్టడానికి, ప్రలోభ పెట్టడానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎన్నో కుట్రలు చేశాడని అన్నారు. తాను ప్రజాప్రతినిధులకు గానీ, ప్రజలకు గానీ, ఓటు కోసం మద్యం, మాంసం పంచలేదని, ఒక్క రూపాయి కూడా ఎవరికీ ఇవ్వలేదని అన్నారు. ప్రజలు ధర్మం దిక్కు, న్యాయంవైపే ఉన్నారని, ముఖ్యమంత్రి కెసిఆర్ పాలనలో తనతోనే అభివృద్ధి సాధ్యమని నమ్మిన లబ్ధిదారులు, ప్రజలు స్పందించిన తీరు అమోఘమని కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోనూ, రామగుండంలోనూ మళ్లీ రానున్నది బిఆర్ఎస్ పాలనేనని అన్నారు. ఇంకా ఈ సమావేశంలో అంతర్గాం జడ్పిటిసి ఆముల నారాయణ, కార్పొరేటర్లు కుమ్మరి శ్రీనివాస్, ఎన్వి.రెడ్డి, బాదె అంజలి, కో ఆప్షన్ మెంబర్ తస్నీం భాను, పిటి.స్వామి, కౌశిక హరి, గోపు అయిలయ్య యాదవ్, పర్లపల్లి రవి తదితరులున్నారు.

## పోరాటంతోనే హక్కుల సాధన నిరూపించిన

# జిడికె 11వ గని కార్మికులు



**గోదావరిఖని, ప్రభాతవార్త:** పోరాటంతోనే హక్కుల సాధన సాధ్యమని జిడికె 11వ గని కార్మికులు నిరూపించారని సిఐటియు అనుబంధ సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. జిడికె 11వ ఇంక్లయిన్ కార్మికులు తరుచూ ప్రమాదాలకు నిలయంగా మారిన కొత్త రోడ్డు స్థానంలో పాత రోడ్డు పునర్ ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున ఆందోళన రెండు రోజులుగా చేయడం జరిగిందని, జిడికె ఓసిపి 5 ప్రారంభంతో పాతరోడ్డు స్థానంలో కొత్త రోడ్డు దాదాపు 15 కిలోమీటర్లు వేయడం జరిగిందని, ఈ కొత్త రోడ్డు కార్మికులకు ఏరకంగాను అనుకూలంగా లేదని, ఈ క్రమంలో కె.సంపత్ అనే కార్మికుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడని, దీనిపై కార్మికులు ఆగ్రహానికి గురై నవంబర్ 29 నుంచి రెండు రోజుల పాటు ఆందోళన నిర్వహించడంతో సిఐటియు కార్మిక సంఘాలన్ని కూడా కార్మికులతో కలిసి ఆందోళన చేపట్టాయని తెలిపారు. దీంతో ఆర్జీ 1 జిఎం అన్ని కార్మిక సంఘాలతో చర్చలు జరిపి డిసెంబర్ 11న పాత రోడ్డును ప్రారంభిస్తామని హామీ ఇవ్వడంతో కార్మికులు ఆందోళన విరమించడం జరిగిందని, కార్మికులందరూ ఐక్యతతో పోరాటం ద్వారానే హక్కులు నిలబడుతాయని నిరూపించారని కార్మికులు, కార్మిక సంఘాల ఐక్యతతో విజయం సాధించడం జరిగిందని, ఇది పూర్తి స్థాయిలో కార్మికుల ఘన విజయమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మెండే శ్రీనివాస్, జెల్ల గజేంద్ర, ఆరెపల్లి రాజమౌళి, గుత్తికొండ గోపాల్, అన్నం శ్రీనివాస్, ఇప్పలపల్లి సతీస్ కుమార్, జె.మల్లేష్, సిహెచ్.దేవేందర్ తదితరులున్నారు.

# ధర్మ పోరాటంలో గెలుస్తాననే విశ్వాసం ఉంది

- రామగుండం ప్రజలు మార్పు కోరుకుంటున్నారు.
- ఇక దోపిడీ పాలనా, ఆత్మహత్యలకు స్వస్తి పలుకుదాం
- విలేకరుల సమావేశంలో రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్

గోదావరిఖని, ప్రభాతవార్త.



రామగుండం శాసన సభ ఎన్నికల్లో ధర్మ పోరాటం జరిగిందని, ఆ పోరాటంలో నేను తప్పకుండా విజయం సాధిస్తానని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్ విశ్వాసం వెల్లిబుచ్చారు. ఆయన శుక్రవారం నాడు గోదావరిఖని పట్టణంలోని ఐఎన్‌టియుసి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రామగుండం ప్రజలు మార్పును కోరుతున్నారని ఆయన అన్నారు. రామగుండంలో ఇక నుంచి దోపిడీ పాలన, ఆర్ఎఫ్‌సిఎల్ లాంటి జాబ్స్ మాఫియా జరగదని ఆయన తేల్చి చెప్పారు. ఉద్యోగాల కోసం డబ్బులు చెల్లించి అనేక మంది యువకులు మోసపోయారని, కొందరు యువకులు ఈ ఉద్యోగాల కుంభ కోణం వల్ల ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆయన తెలిపారు. అలాగే గోదావరిఖని పట్టణంలో జరిగిన బహిరంగ సభలో చెప్పినట్లు రామగుండంలో ఎమ్మెల్యేగా ఏ పార్టీ అభ్యర్థి గెలుస్తారో ఆ పార్టీ రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని అన్నారు. అలాగే కెసిఆర్ అన్న మాట ప్రకారం రామగుండంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుస్తారని, రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని మక్కాన్‌సింగ్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ సారి 70 నుంచి 80 అసెంబ్లీ నియోజక వర్గాలలో కాంగ్రెస్ పార్టీ గెలుపొంది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఆయన తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాతపల్లి ఎల్లయ్య యాదవ్, మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ మహంకాళి స్వామి, కార్పొరేటర్లు పెద్దెల్లి తేజశ్విని ప్రకాష్, ముస్తాఫా, సీనియర్ నాయకులు కాల్వ లింగస్వామి, మాదరబోయిన రవి కుమార్, గట్ల రమేష్ తదితరులున్నారు.

## పెద్దపల్లి వార్త

## ఒకరి ఆత్మహత్య

ముత్తారం, ప్రభాతవార్త.

ముత్తారం మండలం అడవీ శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన బొమ్మెల్ల




రాజమల్లు (55) అనే వ్యక్తి మద్యం మత్తులో పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ముత్తారం ఎస్ఐ మధుసూదన్ రావు తెలిపిన వివరాల ప్రకారం రాజమల్లు కూలీ పనికి వెళ్తూ జీవనం కొనసాగిస్తున్నాడని తెలిపారు. ఆయన భార్య బొమ్మెల్ల లక్ష్మి మృతి చెందిందని, ఈ క్రమంలో రాజమల్లు మద్యంకు బానిసయ్యాడని తెలిపారు. కూలీ డబ్బులతో రోజూ మద్యం సేవించే వాడని, ఈ క్రమంలో శుక్రవారం కూడా మద్యం సేవించి, మత్తులో పురుగుల మందు తాగాడని, ఆ విషయాన్ని అతని సోదరుడు బొమ్మెల్ల ప్రభాకర్‌కు తెలపగా, హుటాహుటిన ముత్తారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు, అక్కడి నుంచి పెద్దపల్లి ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడని తెలిపారు. మృతుని సోదరుడు బొమ్మెల్ల ప్రభాకర్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధుసూదన్ రావు తెలిపారు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం

- సకాలంలో చేరుకున్న ఫైర్ సిబ్బంది
- తప్పిన పెను ప్రమాదం

రూ.3లక్షల ఆస్తి నష్టం

పెద్దపల్లి, ప్రభాతవార్త.



పెద్దపల్లిలోని తుర్కల మద్ది కుంట లోని పోచమ్మవాడలో నివాస ముండే ఈదునూరి దుర్గయ్య ఇంట్లో శుక్రవారం ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ జరి గింది. ఇంటిలో అద్దెకు ఉంటున్న బొంకూరి శ్రీనివాస్‌కు



సంబం ధించిన బంగారం, నగదు, గ్యాస్ సిలిండర్, ఫ్రిజ్, కూలర్, టివి, ఇతర నిత్యవసర వస్తువులు కాలి పోయాయి. అయితే షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇంట్లో గ్యాస్ సిలిండర్ కూడా పేలి మరింత నష్టం జరిగింది. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో అక్కడికి చేరుకున్నారు. ఇంట్లో ఉన్న యాజమానిని, పక్క రూంలో ఉన్న వృద్ధుడిని కాపాడి, చుట్టూ పక్కల మంటలు వ్యాపించకుండా సకాలంలో అగ్నిమాపక సిబ్బంది చర్యలు తీసుకున్నారు. దీంతో పెను ప్రమాదం జరిగింది. సుమారు 3లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితుడు వాపోయాడు. సకాలంలో స్పందించి మంటలను అరికట్టిన వారిలో అగ్నిమాపక ఎస్ఎఫ్ఓ డి.శ్రీనివాస్‌తో పాటుసిబ్బంది ఎండి.సిరాజుద్దీన్, పి.కుమారస్వామి, కె.శ్రీనివాస్, బి.శ్రావణ్ కుమార్, పి.నరేందర్ ఉన్నారు.

## కారు ప్రమాదంలో మహిళ మృతి

ప్రభాతవార్త- బాలసముద్రం

ఓ మహిళను కారు డీకొట్టగా అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. హనుమకొండ నగరంలోని కాజిపేటలో గల సెయింట్ గాబ్రియల్ స్కూల్ నుండి బయటికి వచ్చి బైక్ ఎక్కబోతున్న కవితా అనే ఓ మహిళను ఎక్సైజ్ సిఐ శరత్‌కొడుకు వంశీ అతివేగంగా టీఎస్03ఎఫ్ఏ9881 అనే నెంబర్ గల కారుతో మహిళను గుద్దాడు. దీంతో కవిత అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా తమకు న్యాయం చేయాలని ఫాతిమా నగర్ జంక్షన్‌లో మృతురాలి బంధువులు ధర్నా చేసి భారీగా ట్రాఫిక్ జామ్ చేపట్టారు.

## ప్రపంచ కళా సాహిత్య ఉత్సవాలకు కవి రాజశేఖర్ రెడ్డికి ఆహ్వానం

- మారుమూల గ్రామం నుండి దక్కిన

ప్రపంచ స్థాయి కళా గౌరవం

చిగురుమామిడి, ప్రభాతవార్త



కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం గాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ కవి, రచయిత, గాయకుడు శ్రీ కల్వల రాజశేఖర్ రెడ్డికి ప్రపంచ కళా సాహిత్య ఉత్సవాల ఆహ్వాన అరుదైన గౌరవం లభించినట్లు శుక్రవారం రోజున ప్రభాత వార్తకు తెలిపారు. ప్రముఖ సాహితీ సంస్థ శ్రీశ్రీ కళావేధిక ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని తూర్పు గోదావరి జిల్లా తాడేపల్లి గూడెంలో డిసెంబర్ 16,17 తేదీల్లో 30 గంటల పాటు నిర్వహించే సాహితీ కళా ఉత్సవాలకు తనకు ప్రత్యేక ఆహ్వానం అందినట్లు వారు తెలిపారు. శ్రీశ్రీ కళావేధిక సంస్థ చైర్మన్ కత్తిమండ ప్రతాప్, నిర్వాహకురాలు కే రమాపతి, కట్ల భాగ్యలక్ష్మి గార్లకు రాజశేఖర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సన్నీల్ల వెంకటేష్, ఉప సర్పంచ్ అన్నాడి మల్లిఖార్జురన్‌రెడ్డి గ్రామస్థులు తదితరులు రాజశేఖర్‌రెడ్డిని అభినందిస్తూ, చిగురుమామిడి మండలం గాగిరెడ్డిపల్లి గ్రామం నుండి ప్రపంచ స్థాయి కళా సాహిత్య ఉత్సవాలకు వెళ్ళడం తమ గ్రామానికి ఎంతో గర్వ కారణమని ప్రశంసించారు. భవిష్యత్‌లో మరెన్నో కళా సాహిత్య కార్యక్రమాల్లో పాల్గొని గ్రామానికి తనకు చక్కటి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

## కుంకుమేశ్వర ఆలయంలో అన్నదానం

పరకాల, డిసెంబర్ 1, ప్రభాతవార్త

పరకాల పట్టణంలోని శ్రీభవాని కుంకుమేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీకమాసం మూడవ శుక్రవారం పురస్కరించుకొని పూజారి కోమాళ్ళపల్లి సంపత్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీకమాసం ప్రారంభం నుండి ఆలయంలో నిత్యం మహాఅన్నదాన కార్యక్రమాలను దాతల సహాయ సహకారాలతో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ గండె వెంకటేశ్వర్లు తెలిపారు. నిత్య అన్నదాన కార్యక్రమాలో భాగంగా శుక్రవారం బొజ్జం నర్సక్క ఆనందం దంపతులు అన్నదానం, అల్పాహార కార్యక్రమదాత భూషి భారతి-ప్రభాక్‌రెడ్డి దంపతుల సహకారంతో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్‌తో పాటు ధర్మకర్తల మండలి ఆలయ వంశానుగత అర్చకులు కోమాళ్లపల్లి నాగభూషణశర్మ, ఆలయ కార్యనిర్వాహణాధికారి వెంకటయ్య, భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా పోలీస్ కిష్టయ్య వర్ధంతి వేడుకలు

గణపురం, డిసెంబర్ 1, ప్రభాతవార్త




మండలకేంద్రంలో తెలంగాణ మలిదశ పోరాట తొలి అమరుడు పుట్టకొక్కుల కిష్టయ్య ముదిరాజ్ పోలీస్ కిష్టయ్య 14వ వర్ధంతి కార్యక్రమాన్ని ముదిరాజ్ మహసభ మండల యూత్ అధ్యక్షుడు పెండ్యాల వెంకటేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ముదిరాజ్ మహసభ జిల్లా అధ్యక్షులు ఆకుల సుభాష్ ముదిరాజ్ హజరై కిష్టయ్య ముదిరాజ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా సుభాష్ ముదిరాజ్ మాట్లాడుతూ..నిజామాబాద్ జిల్లా బిక్కనూరు మండలం సిపాయిపల్లికి చెందిన పుట్ట కొక్కుల కిష్టయ్య ముదిరాజ్ అన్యాయాల పట్ల తీవ్రంగా స్పందించే వారని, డిగ్రీ వరకు విద్యనభ్యసించి కానిస్టేబుల్ ఉద్యోగం చేస్తూ ఆత్మబలిదానం చేసుకున్న తెలంగాణ ముదిరాజ్ ముద్దుబిడ్డ అని అన్నారు. ఈకార్యక్రమంలో బిసిసెల్ మండల అధ్యక్షుడు మాల భద్రయ్య, సోషల్ మీడియా ఇంచార్జ్ జోడు ప్రదీప్ ముదిరాజ్, బుద్దారం కులపెద్ద మాల రవి, ముదిరాజ్ గ్రామ కమిటీ అధ్యక్షులు మాల రమేష్, ముదిరాజ్ నాయకులు మల్లెవేన వేణు, మల్లెవేన రాజు, సారంగం, గుల్ల భద్రయ్య, సమ్మయ్య, గుల్ల రమేష్, రాజ్‌కుమార్, సురేష్, మాల సతీష్, పోలు దేవేందర్, మల్లెవేన రాకేష్, దుర్గయ్య, మల్లెవేన రమేష్, రాంబాబు, పోలు కుమార్, పిట్టల భాస్కర్, మాల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# కోరుట్ల నియోజకవర్గంలో 75.62-శాతం పోలింగ్

**ఈ నెల 3న తేలనున్న భవితవ్యం**

కోరుట్ల, ప్రభాతవార్త




అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో భాగంగా కోరుట్ల నియోజకవర్గంలో సాయంత్రం 5గంటల వరకు సుమారు 73శాతం ఓటింగ్ నమోదు కాగా, పూర్తి స్థాయి ఓటింగ్ ముగిశాక కోరుట్లలో 75.62శాతం పోలింగ్ నమోదు అయినట్లు రిటర్నింగ్ అధికారి రాజేశ్వర్ తెలిపారు. కోరుట్ల నియోజకవర్గంలోని కోరుట్లలో 59,507ఓట్లకు గానూ 41,392 ఓట్లతో 69.56శాతం, కోరుట్ల మండలంలో 30,461ఓట్లకు గానూ 24,548ఓట్లతో 80.59శాతం, మెట్‌పల్లి పట్టణంలో 44,068ఓట్లకు గానూ 29,581ఓట్లతో 67.13 శాతం, మెట్‌పల్లి మండలంలో 36,115ఓట్లకు గానూ 28,657ఓట్లతో 79.35శాతం, ఇబ్రహీం పట్నం మండలంలో 30,476ఓట్లకు గానూ 24,757ఓట్లతో 81.23శాతం, మల్లాపూర్ మండలంలో 40,228ఓట్లకు గానూ 33,205ఓట్లతో 82.54 శాతం, ఇతరులు నాలుగు ఓట్లకు గానూ 2ఓట్లు ఓటింగ్ నమోదు అయ్యింది. కోరుట్ల నియోజ కవర్గంలో పుర ుషులు 1,15,027ఓట ్లకు గానూ 80,353ఓట్లు, మహిళలు 1,25,824 ఓట్లకు గానూ 1,01,785 ఓట్లు నమోదు అయ్యాయి. కోరుట్ల నియోజకవర్గంలో అత్యధి కంగా మల్లాపూర్ మండలంలో 82.54శాతంతో ఓట్లు నమోదు కాగా, అత్యల్పంగా మెట్‌పల్లి పట్టణంలో 67.13శాతం నమోదు అయ్యాయి. కోరుట్ల నియోజకవర్గంలో పురుషుల కంటే మహిళ ఓట్లు 21,432ఓట్లు అధికంగా పోలింగ్ కాగా, ఈ ఎన్నికల్లో మహిళా ఓట్లే కీలకం కావడం, మహిళలు ఎటువైపు పార్టీకి మొగ్గు చూపుతారో అటువైపు పార్టీ గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

**ఉత్కంఠగా ఎదురుచూస్తున్న అన్ని పార్టీ నాయకులు**

ఎన్నికల నేపథ్యంలో భాగంగా కోరుట్ల నియోజకవర్గంలో 75.62శాతంతో 1,82,140 మంది ఓట్లు హక్కు నమోదు చేసుకోగా, ఈ నెల 3న వెలుబడే ఎన్నికల ఫలితాలకై అన్ని పార్టీల నాయకులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. బీఆర్ఎస్‌కు చెందిన కల్వకుంట్ల సంజయ్‌కుమార్, కాంగ్రెస్‌కు చెందిన జువ్వాడి నర్సింగరావు, బీజేపీకి చెందిన ధర్మపురి అరవింద్‌లు ఈ ఎన్నికల్లో తామంటే తామే విజయం సాధిస్తున్నామని లెక్కలు వేసుకుంటున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కోరుట్లలో ఇంత రసవత్తరంగా ఎన్నికలు కొనసాగడం ఇదే ప్రప్రథమం. కోరుట్లలో ఏ పార్టీ గెలిచిన సుమారు 10వేల ఓట్లతోనే విజయం సాధించబోతున్నారని ధీమాగా ఉన్నారు.

# వేములవాడలో విజయంపై ఎవరి ధీమా వారిదే...

- ఎమ్మెల్యే ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠ
- లెక్కలేసుకుంటున్న పార్టీలు
- పోలింగ్ సరళిపై అభ్యర్థుల లెక్కలు
- రేపు బద్దెనపల్లిలో ఓట్ల లెక్కింపు

వేములవాడ, ప్రభాతవార్త.






వేములవాడ అసెంబ్లీ పరిధికి ఎన్నికలు ముగిశాయి. ఇక ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ మిగిలింది. పోటా పోటీగా జరిగిన ఈ ఎన్నికలు అందరిలోనూ ఆసక్తి రేపుతున్నాయి. ఈ సారి 78.42శాతం పోలింగ్ నమోదు కావడంతో ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో కలవరం మొదలైంది. అనూహ్యంగా పెరిగిన పోలింగ్ ఎవరికి లాభం చేకూరుస్తుందోనని అభ్యర్థులు లెక్కలు వేసుకుంటున్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ శాతం గణంకాలను తెప్పించుకొని విశ్లేషించుకుంటున్నారు.

**లెక్కలు వేసుకుంటున్న పార్టీలు...**

అసెంబ్లీ ఎన్నికలకు పోలింగ్ ముగిసిన మరుసటి రోజు నుంచే పార్టీలు విజయ అవకాశాలపై లెక్కలు వేసుకుంటున్నాయి. నియోజక వర్గంలోని మండలాల వారీగా ఓట్ల సరళిని అంచనా వేస్తున్నారు. క్షుణ్ణంగా లెక్కలు వేసుకుంటూ విజయంపై ఒక క్లారిటీ వచ్చేలా చర్చిస్తున్నారు. శుక్రవారం మొత్తం అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలతో సమావేశం అయ్యి ఎక్కడ ఎంత పోలింగ్ అయింది... ఓట్లు ఆయా గ్రామంలో ఏ పార్టీకి ఓట్లు పడ్డాయి అనే దానిపై సుదీర్ఘంగా చర్చించారు.

విజేతలు ఎవరో... పరాజితులు ఎవరో ఆదివారం తేలిపోనుంది. అయితే, ఈ విజయావకాశాలపై బరిలో ఉన్న అన్ని పార్టీలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. గురువారం నియోజక వర్గంలో జరిగిన పోలింగ్ సరళిపైనే జోరుగా విశ్లేషణ నడుస్తోంది. ఫలితాల మాట ఎలా ఉన్నా పార్టీలు బలపరిచిన అభ్యర్థులు ఈ ఎన్నికల్లో గట్టి పోటీనే ఎదుర్కొన్నారు. ఎమ్మెల్యే ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్, అంతే స్థాయిలో బిజెపి బలమైన పోటీదారుగా నిలిచింది. ఉద్యోగులు, యువతలో ప్రభుత్వం పట్ల వ్యతిరేకత లేదని నిరూపించుకోవడానికి అధికార బిఆర్ఎస్ శక్తికి మంచి కష్టపడాల్సి వచ్చింది. రకరకాల పద్ధతుల్లో ఓటర్లను ఆకర్షించడానికి ప్రయత్నించింది. హోరాహోరీగా జరిగిన ఈ పోరులో ప్రధాన పార్టీల అభ్యర్థులందరూ గెలుపు ధీమాను వ్యక్తం చేస్తున్నారు. ఓటేసిన ఉద్యోగులు, యువకులు ఎవరి అంచనాల్లో వారున్నారు.

**వేములవాడ ఎవరి పరమో...**

వేములవాడ నియోజక వర్గం ఎవరి వరం కానుందో ఆదివారం జరిగే ఎన్నికల కౌంటింగ్‌లో భవితవ్యం తేలనుంది. ఎన్నికల నోటిఫికేషన్ ప్రారంభం కాక ముందు నుంచి పోలింగ్ అయిపోయే వరకు సెంటిమెంట్‌తో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆది శ్రీనివాస్ సర్వేలలో ముందంజలో ఉన్నట్లు మొదటి నుంచి ప్రచారం జరుగుతుంది. వరుసగా వేములవాడ నియోజక వర్గం నుంచి వివిధ పార్టీల ద్వారా పోటీలో నిలిచి ఓటమి పాలయ్యారు. 2023 ఎన్నికలకు వచ్చే సరికి ఆది శ్రీనివాస్‌కు ఎనలేని సెంటిమెంట్ వచ్చిం ది. అదే ఊపు పోలింగ్ రోజు వరకు కొనసాగి హస్తం హవా కనిపించింది. అధి కారి బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పెట్టుకొని ఓటర్లను ప్రసన్నం చేసుకొనడానికి సర్వశక్తులను ఉపయోగించాడు. పోలింగ్ రోజు చివరి రెండు గంటల ముందు కూడా ఓట్లు వేయని వారిని ప్రత్యేక వాహనాల ద్వారా పోలింగ్ సెంటర్‌లకు తర లించి ఓట్లు వేయించారు. ప్రభు త్వ సంక్షేమ పథకాలు పార్టీ క్యాడర్ అన్ని కలిస్తే విజయం తనదేనన్న ధీమాలో అభ్యర్థి ఉన్నాడు. బిజెపి అభ్యర్థి చెన్నమనేని వికాస్ రావు గత నాలుగు సంవత్స రాల నుంచి సామాజిక కార్యక్రమాలను నియోజక వర్గంలోని ప్రతి గ్రామంలో చేరవేస్తూ తనదైన శైలిలో ప్రచార పర్వాన్ని కొనసాగించాడు. మొదటగా పార్టీ టికెట్‌పై కొంత ఇబ్బందులు కలిగిన తరువాత ఆయనకే కేటాయిస్తూ పార్టీ బి ఫామ్ ఇవ్వడంతో ప్రచారాన్ని అత్యంత వేగంగా చేస్తూ గెలుపు లైన్‌లో ముద్ర వేసుకున్నాడు. బిజెపి అభ్యర్థి నియోజక వర్గంలో అత్యధిక ఓట్లు తనకే వస్తాయన్న ధీమాతో గెలుపు అవకాశాలు మెండుగా ఉన్నాయని ధీమాగా ఉన్నారు. గెలుపు తమదంటే తమదే అనే శైలిలో కార్యకర్తలలో జోష్ పంచుతూ విజయోత్సవాలకు సిద్ధంగా ఉండాలని చెబుతున్నారు. ఆదివారం జరిగే ఓట్ల లెక్కింపులో అభ్యర్థుల భవితవ్యం తేలనుంది.

# కోరుట్ల వార్త



## అనారోగ్యంతో బాధపడుతున్న వారిని కలిసిన జువ్వాడి

కోరుట్ల రూరల్, ప్రభాతవార్త



మండలంలోని మాదాపూర్ గ్రామంలోని మాజీ ప్రజాప్రతినిధులు నర్సారెడ్డి, కటకం రాజరెడ్డి, ఏనుగు రాజరెడ్డిలు అనారోగ్యంతో బాధపడ తున్నారు. కాగా వారిని కాంగ్రెస్ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నాయకులు సత్యనారాయణగౌడ్ తదితరులున్నారు.

## నూతన గృహప్రవేశానికి హాజరైన జువ్వాడి బ్రదర్స్

కోరుట్ల రూరల్, ప్రభాతవార్త




కోరుట్ల నియోజకవర్గంలోని వెంకటాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బర్కం చిట్టిబాబు నూతన గృహ ప్రవేశం కార్యక్రమానికి కోరుట్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జువ్వాడి నర్సింగరావు, సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు హాజరయ్యారు. వారి వెంట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ బోయినిపల్లి సత్యనారాయణరావు, కోరుట్ల మండల నాయకులు సత్యనారాయణ, బర్కం నర్సయ్య, భూమయ్య, రవీందర్‌రెడ్డి, గంగాధర్, వాకిటి భూమారెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలున్నారు.

## వైభవంగా అయ్యప్ప స్వామి పడిపూజ

మల్లాపూర్ - ప్రభాతవార్త :

మల్లాపూర్ మండలంలోని గుండంపల్లి గ్రామానికి చెందిన అయ్యప్ప దీక్షాపరుడైన మార్గం గంగారెడ్డి నివాసంలో అయ్యప్ప స్వామి పడిపూజ శుక్రవారం గురుస్వామి ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా గురుస్వామి సమక్షంలో అయ్యప్ప దీక్షాపరులు స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి వేదమంత్రోచ్ఛరణాల మధ్య పూజలు నిర్వహించారు. అయ్యప్ప భజనలతో కార్యక్రమం కొనసాగింది. ఈమేరకు గురుస్వామి మాట్లాడుతూ అయ్యప్ప దీక్ష మాలధారణతో సంపూర్ణ ఆరోగ్యం, మానసికోల్లాసం, దైవచింతన ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప దీక్షాపరులు లక్ష్మారెడ్డి, రాంప్రసాద్, సుధాకర్, రాజేష్‌కుమార్, నాసం తిరుపతి, మార్గం శరత్,, తదితరులు పాల్గొన్నారు.




# అమాట్ అల్ఫోర్స్ మ్యాథ్స్ ఒలంపియాడ్ టెస్ట్-2024 గోడ పత్రిక ఆవిష్కరణ




**కరీంనగర్ రూరల్,ప్రభాతవార్త:** కరీంనగర్ వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ విద్యాసంస్థల కేంద్ర కార్యాలయంలో డిసెంబర్ 22న శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని నిర్వహింపబడే అల్ఫోర్స్ మ్యాథ్స్ ఒలంపియాడ్ టెస్ట్-2024 గోడ పత్రికను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. గణిత శాస్త్రం చాలా ప్రాముఖ్యమైనదని, వివిధ పోటీ పరీక్షలకు ఉపకరిస్తుందని, తద్వారా విజయం సాధించడం చాలా సులువుగా ఉంటుందని అన్నారు. శ్రీనివాస రామనుజన్ భారతదేశం చాలా గర్వించదగ్గ గణిత శాస్త్రవేత్తని, భారతదేశ గణిత రంగానికి వారు చేసిన సేవలు చారిత్రత్మామైనవని, ఆదర్శనీయమైనవని వారు చెప్పారు. వారి విశిష్టతను, చేసిన సేవలను విద్యార్థులకు తెలియజేయడానికై ప్రతి సంవత్సరం వారి జ్ఞాపకర్థమై విద్యార్థులకు ప్రతిభ పరీక్షను నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఈ సంవత్సరం సైతం అదే స్ఫూర్తితో పరీక్షను నిర్వహించడానికి అన్ని సన్నహాలు చేస్తున్నామని, తెలంగాణ రాష్ట్రంలోనే అతి పెద్ద మ్యాథ్స్ ఒలంపియాడ్ అని హార్షం వ్యక్తం చేశారు. ఈ పరీక్షను 6 నుండి 10వ తరగతి విద్యార్థులకు ఈనెల 17వ తేదీన ఆదివారం ఉదయం 10 గంటలకు తెలంగాణలోని వివిధ అల్ఫోర్స్ పాఠశాలల్లో, కళాశాలల్లో పరీక్షను నిర్వహించడం జరుగుతుందని, ఈ పరీక్షలో మొదటి 3 స్థానాలలో గెలిచిన విద్యార్థులకు 22వ తేదీన శ్రీనివాసన్ రామనుజన్ జయంతిని పురస్కరించుకొని నిర్వహింపబడే జాతీయ గణిత దినోత్సవ వేడుకలలో అతిథుల చేతుల మీదుగా బహుమతులను, నగదు, పారితోషికాలను ప్రధానం చేయడం జరుగుతుందని చెప్పారు. అదే విధంగా విద్యార్థులకు ప్రోత్సహం అందించడానికై పోటీ పరీక్షకు హాజరైన ప్రతి విద్యార్థికి సర్టిఫికేట్ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ఈ పరీక్షకు ఎటువంటి రుసుము లేదని, కరీంనగర్‌లోని గోపాల్‌రావు పేటలో నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. విద్యార్థులు ప్యాడ్, పెన్, పెన్సిల్, పాఠశాల నుండి ధృవీకరణపత్రం లేదా ఐడీ కార్డు తెచ్చుకోవాలని సూచించారు. పరీక్షకు హాజరయ్యే వారు గంటకు ముందు సంబంధిత కేంద్రంలో ఉండాలని చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకొని గణితశాస్త్రం పట్ల పట్టు సాధించాలని, ముందస్తు అభినందనలు తెలియజేశారు. విద్యాసంస్థల యాజమాన్యలు వారి విద్యార్థులకు సమాచారం అందజేసి ప్రోత్సహం అందించాలని కోరారు. మరిన్ని వివరాలకు 9160294441, 9398230614, 9246934441 ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్య సంస్థల సిబ్బంది, పరీక్ష నిర్వహకులు పాల్గొన్నారు.

# అదునుచూసి.. అడ్డగోలుగా అందినంత దండుకున్న గల్లీ లీడర్లు

**- నాడు 6000 వద్దన్న ఇచ్చారు.. నేడు 500తో సరిపెట్టారు.. నారాజైన ఓటర్ దేవుళ్లు**



**జమ్మికుంట (హుజురాబాద్ ఆర్సీ), ప్రభాతవార్త:** అటు దేశంలోను.. ఇటు రాష్ట్రంలోను.. హుజురాబాద్ నియోజకవర్గం అంటేనే.. తెలియని రాజకీయ పార్టీలు ఉండవు అంటే అతిశయోక్తి కాదు.. నాడు 2018లో అంతంత మాత్రంగా ఓటర్ దేవుళ్లకు కానుకలుగా ఇచ్చిన ప్రధాన రాజకీయ పార్టీలు 2021 ఉప ఎన్నికలో వద్దన్న అదే ప్రధాన పార్టీలు ఓటుకు 6000ఒకరు.. 3000 మరోకరు.. 1500 ఇంకొకరు వద్దంటే.. వద్దన్న.. ఆనాడు ఒక ఓటుకు 10,500రూపాయలు బ్రతిమిలాడి ఇచ్చిపోయారు. ఇదే జోరు మునుగోడు నియోజకవర్గ ఉప ఎన్నికల్లో పునారవృతం అయింది. హుజురాబాద్ అంటేనే.. రాజకీయాలు చాలా కాస్ట్లి గురూ.. అనే విధంగా దశ దిశలా ఓ వెలుగు వెలిగింది. ఈ నవంబర్ 30 గురువారం జరిగిన అసెంబ్లీ సాధారణ ఎన్నికలకు హుజురాబాద్ ఎన్నికల బరిలో 22మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. మూడు ప్రధాన రాజకీయ పార్టీల మధ్య త్రిముఖ పోరు నువ్వా.. నేనా అనే విధంగా జరిగింది. ఈ తగ్గాపరి పోరులో ఓటర్లు, రాజకీయ పార్టీల నేతలు కలిపించిన ఆశలతో.. తృణమో.. పణమో.. వస్తుందన్న ఆశతో 27, 28, 29 తేదిలలో కళ్లల్లో వత్తులు వేసుకుని, ఓటర్ దేవుళ్ల నియోజకవర్గంలో అనేక గ్రామాలలో ఎదురుచూపులు చూసి పడిగాపులు కాసారు.. చివరకు గ్రామాలలో వ్యవసాయ పనులకు కూడా వెళ్లకుండా ఏ ఊరికి, ఏ పల్లెకు వెళ్లకుండా ఇండ్ల వద్దనే ఎవరైన వస్తారేమోనని, ఏదైన ఇస్తారేమోనని, డేగా కండ్లతో ఎదురుచూసారు. సమయం దగ్గర పడడంతో 28, 29 తేదిలలో గ్రామాలలో ఇండ్ల ముందు లైట్లు అర్పకుండా ప్రధాన డోర్లు తీసిపెట్టి ఓటర్లు ఎదురుచూపులు చూసారు. చరిత్రలో ఓట్లు వేసే ప్రజలు మా గ్రామానికి ఈ పని చేస్తే.. లేదా మా కులానికి గీ పలానా పనిచేస్తే.. మాకు గింత సొమ్ము ముట్టజెప్పాలని ఓటర్లు సిండికేట్‌గా మారి నాయకులను డిమాండ్ చేసిన వైనాన్ని చూసాం.. ఈ సారి ఎన్నికల్లో 29వ తేది మిట్ట మధ్యాహ్నం వరకు 5మండలాల పరిధిలో ప్రధాన రాజకీయ పార్టీల నేతలు ఏ ఒక్కరికి రూపాయి చిల్లి గవ్వ ఇవ్వకుండా మూడు ప్రధాన పార్టీల ద్వితీయ శ్రేణి, కరుడుగట్టిన రాజకీయ నేతలు ఎవరు గెలిచిన పర్వాలేదు..? ఒక ఓటరుకు 500 రూపాయలకంటే ఎక్కువ ఇవ్వకూడదని ఆ నేతలు తీర్మాణించుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది..? దీనితో 29వ తేది సాయంత్రం నాలుగు గంటల నుండి ఒక రాజకీయ పార్టీ ఓటుకు 500 రూపాయల చొప్పున తెల్లవారు 6గంటల వరకు ఏకకాలంలో నియోజకవర్గంలో పంపిణీ చేసినట్లు..? విశ్వసనీయంగా తెలియవచ్చింది. మిగతా రెండు రాజకీయ పార్టీల నేతలు గ్రామాలలో వార్డుల వారిగా మున్సిపాలిటీలలో సైతం గల్లీ లీడర్లకు ఓటుకు 500 రూపాయల చొప్పున లెక్కలు కట్టి ఇచ్చినట్లు తెలిసింది. ఆ పార్టీల నాయకులు అర్ధరాత్రి మొదలుపెట్టి తెల్లవారు 10 గంటల వరకు ఓటుకు 500రూపాయల చొప్పున పంపకాలు చేసినట్లు ఓటర్లు బాహటంగా తెలిపారు. ఎక్కువ శాతం గ్రామాలలో, పట్టణాలలో గల్లీ లీడర్లు కేవలం 50-60 శాతం ఓటర్లకు మాత్రమే 500 రూసపాయల చొప్పున ఇచ్చినట్లు తెలిసింది. అనేక చోట్ల డబ్బులు పంపిణీ కోసం తీసుకెళ్లిన గల్లీ లీడర్లు ఆ డబ్బులు పంపిణీ చేయకుండా సెల్‌ఫోన్‌లు స్విచ్ ఆఫ్ చేసుకుని, అటు ఓటర్లకు, కార్యకర్తలకు డబ్బులు పంపిన ప్రధాన అనుచరులకు ఎక్కడ కూడా వారి ఆచూకీ లభించకపోవడంతో ఓటర్లు గగ్గొలు పెట్టారు. ఉదయం 7గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట గడిచినప్పటికి హుజురాబాద్ నియోజకవర్గంలో కేవలం 41.40 శాతం పోలింగ్ నమోదైంది. మూడు పార్టీల అభ్యర్థులు కొంత మందికి 500 రూపాయల చొప్పున ఇచ్చి.. కొంతమందికి ఇవ్వకపోవడంతో అనేక చోట్ల గల్లీ లీడర్లను ఓటర్లు నిలదిసారు. మీ కోసం మాకు ఇచ్చిన డబ్బులు అయిపోయినయ్.. మళ్లి వస్తే ఇస్తాం.. అంటూ దాటవేసారు. మరికొన్ని చోట్ల ఓట్ల రసీదులో తీసుకుని ఓటర్లచేత ప్రమాణాలు చేయించుకుని, ఓటుకు 500 రూపాయల చొప్పున ముట్టజెప్పారు. మరికొన్ని చోట్ల ఓట్లు వేసి వచ్చిన తర్వాత గట్టిగా నిలదీసిన ఓటర్లకు ఆయా రాజకీయ పార్టీల గల్లీ లీడర్లు డబ్బులు ముట్టజెప్పారు. గ్రామాలలో 29వ తేది రాత్రి ఓటుకు 500రూపాయల చొప్పున అర్ధరాత్రి ఇండ్లలోకి వెళ్లి తలుపుతట్టి ఓటుకు 500 చొప్పున ముట్టజెప్పిన చోట మోటా లీడర్లు ఇంత రాత్రి మీ కోసం వచ్చి చలిలో ఇస్తున్నాం.. అంటూ నచ్చజెప్పి 450రూపాయలు మాత్రమే అప్పజెప్పినట్లు పలువురు తెలిపారు. ఒక రాజకీయ పార్టీకి చెందిన నేత ఓటుకు 1000-3000 ఇవ్వడానికి సంసిద్ధమై మిగతా రెండు రాజకీయ పార్టీల ద్వితీయ శ్రేణి నేతలను తప్పుదారి పట్టించి.. తాను మాత్రం ఓటుకు 500 రూపాయలతో పాటు ఒక మందు బాటిల్ పంపిణీ చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది...? ఏదిఏమైనప్పటికి ఈ సారి హుజురాబాద్ నియోజకవర్గంలో ఎవరి అంచనాలు అందకుండా ఉత్కంఠబరితంగా సాగిన ఎన్నికల పోరులో మూడు పార్టీల అభ్యర్థులు నువ్వా...? నేనా..? అనే విధంగా పోటాపోటీగా ఎవరి స్థాయిలో వారు ఓట్ల కోసం పడరానిపాట్లు పడి ఎదురీత ఈదారు.. ఏ ఒక్కమండలంలో ఒకే పార్టీ పూర్తిగా క్లీన్ స్వీప్ చేస్తుందన్న భరోసా ఏ పార్టీ అభ్యర్థులలో కనిపించలేదు.. ఇప్పటికి 30న ఎన్నికల జరిగిన అనంతరం 80శాతం పై చిలుకు పోలింగ్ శాతం జరిగిన ఎవరికి వారే లెక్కలు వేసుకుంటూ ఊహల గెలుపులోకంలో ముగ్గురు అభ్యర్థులు విహారిస్తున్నారు. వీరికి తోడు నియోజకవర్గంలో సర్వత్ర, అక్కడ, ఇక్కడ, ఎక్కడ అనే తేడా లేకుండా ఏ ఇద్దరు కలిసిన రాజకీయ పార్టీల గెలుపు, ఓటమిలపై చర్చోపచర్చలు జరగుతున్నాయి. ఎవ్వరు ఎంత బిజిగా ఉన్నప్పటికి మూడు పార్టీలకు చెందిన గల్లీ లీడర్లు మాత్రం 2లక్షల రూపాయల నుండి 5లక్షల రూపాయల వరకు ఇదే అదునుగా చూసుకుని ఓటర్లకు అందించవల్సిన సొమ్మును ఆ లీడర్లు అందినంతగా దండుకున్నారని, అటు గ్రామాలలో, ఇటు పట్టణాలలో ఓట్లు వేసిన ప్రజలు లబోదిబోమంటున్నారు. నష్టపోయింది మాత్రం ఓటర్ దేవుళ్లు.. ఇంత పాపం ఎన్నడు జరగలేదంటూ ఓటర్లు ముక్కున వేలేసుకుంటున్నారు.

# కరీంనగర్ వార్త

## ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా


# చట్టాలపై అవగాహన సదస్సు




**కరీంనగర్ టౌన్,ప్రభాతవార్త:** రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే.వెంకటేశ్ ఆధ్వర్యంలో వెలిచాల గ్రామంలోని ప్రశాంతి బాల బాలికల కేర్ గృహంను సందర్శించి ఎయిడ్స్ వ్యాధికి గురైన బాలబాలికలకు భారత రాజ్యాంగం కల్పిస్తున్న హక్కుల గురించి, పిల్లలు బాల్యం నుంచే మంచి నడవడికను అలవర్చుకోవాలని, చక్కగా చదువుకొని క్రమశిక్షణతో ఎంచుకున్న లక్ష్యాలను సాధించడానికి కృషి చేయాలని, ఈ సందర్భంగా వసతి గృహంలో అందుతున్న సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎలాంటి న్యాయపరమైన సహాయాన్ని అందించడానికైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిద్ధంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కే.వెంకటేష్‌తో పాటు లీగల్ ఏయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ కృష్ణార్జున చారి, తణుకు మహేష్, ఆశాడపు శ్రీనివాస్, వసతి గృహం నిర్వాహకులు సిరిల్ పాల్గొన్నారు.

# ఎస్‌జిఎఫ్ జాతీయ స్థాయి ఆర్చరీ ఛాంపియన్ షిప్ పోటీలకు పారమిత విద్యార్థి ఎంపిక

**కరీంనగర్ రూరల్,ప్రభాతవార్త:** కరీంనగర్ అలుగునూర్‌లోని పారమిత వరల్డ్ స్కూల్ 12వ తరగతి చదువుతున్న విద్యార్థి నిజాం అస్మిత అండర్ 19 బాలికల విభాగంలో ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ఆర్చరీ ఛాంపియన్ షిప్ పోటీలకు ఎంపికైయ్యింది. ఇటీవల నవంబర్ 26న వరంగల్ జిల్లా తొర్రూరులో ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అర్చరీ ఛాంపియన్ షిప్ పోటీలలో నిజాం అస్మిత అత్యధిక ప్రతిభ కనబరచి కాంస్య పతకం సాధించి, జాతీయ స్థాయి పోటీలలో డిసెంబర్ 7 నుంచి 10 వరకు గుజరాత్ రాష్ట్రంలోని నందియాడ్‌లో జరుగు జాతీయ స్థాయి పోటీలలో పాల్గొననుందని పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.శ్రీకర్ తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయికి ఎంపికైన నిజాం అస్మితను పారమిత విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఈ.ప్రసాదరావు, డైరెక్టర్స్ వి.యు.ఎం.ప్రసాద్, అనుకర్ రావు, రష్మిత, ప్రసూన, వినోద్ రావు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సమన్వయకర్త ఆర్.నాగరాజు, పిఈటీలు తిరుపతి, శ్రీధర్, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.



# సిరిసిల్లలో కషాయి జెండా ఎగురుతుంది

### బిజెపి ఎమ్మెల్యే రాణిరుద్రమ

సిరిసిల్ల టౌన్,ప్రభాతవార్త :



భారతీయ జనత పార్టీ మహిళలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి రాణిరుద్రమ రెడ్డి అన్నారు.శుక్రవారం బిజెపి కార్యలయంలో నిర్వహించిన సమావేశంలో రుద్రమ మాట్లాడుతూ సిరిసిల్ల జరిగిన శాసనసభ ఎన్నికల్లో కాషాయ జెండా ఎగరవేస్తుందని అన్నారు. సిరిసిల్ల నియోజకర్గంలో అన్ని గ్రామాలు, పట్టణంలోని 39 వార్డులో ప్రజలందరిని కలుసు కోవడం జరిగిందని అన్నారు. ప్రజలందరు పెద్ద ఎత్తున్న అశీర్వ దించడం జరుగు తుందని తెలిపారు. భారతీయ జనత పార్టీ బిసి,మహిళ ఎజెండాతో పని చేస్తుందని అన్నారు.మహిళలకు 33శాతం రిజర్వరేషన్ పార్లమెంట్ అమలు చేసి సిరిసిల్లకు మహిళలగా పంపించడం జరిగిందని అన్నారు.శాసన ఎన్నికలలో రాష్ట్ర వ్యాప్తంగా సిరిసిల్ల ఎన్నికల్లో చర్చించుకోవడం జరిగిందని అన్నారు. ప్రజలందరు ఓట్ల రుపంలో వేయడం జరిగిందని అన్నారు.ప్రజలతో కలువని నాయకుడిని వద్దు అని బిజెపి ఓట్లు వేయడం జరిగిందని అన్నారు. భారతీయ జనత పార్టీ అన్ని వర్గాల అభివృద్దికి కృషి చేస్తుందని ప్రజలు నమ్మడం జరిగిందని అన్నారు. శాసన సభ ఎన్నికల్లో కృషి చేసిన నాయకులు, కార్యకర్తలు,అనుబంద సంఘం నాయకులందరికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మల్లరెడ్డి, నాగుల శ్రీనివాస్, మాదవి, సంజీవ్, శ్రీనివాస్,గాంది,సంతోష్, వంగ అనిల్, ప్రకాష్, గోపి తదితరులు పాల్గొన్నారు.

## రాజన్న సిరిసిల్ల వార్త

## ప్రజలందరు బిఆర్ఎస్ పార్టీని అశీర్వదించారు

### -బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట అగయ్య

సిరిసిల్ల టౌన్,ప్రభాతవార్త :



ప్రజలందరు బిఆర్ఎస్ పార్టీని అశీర్వదించారని బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట అగయ్య అన్నారు. శుక్రవారం తెలంగాణ భవనంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ మూడవసారిగా ముఖ్యమంత్రి గా కేసిఆర్ సిఎంగా ప్రమాణ స్వీకరణం చేయడం జరుగుతుందని అన్నారు. సిరిసిల్ల ప్రజలందరు శాసనసభ్యుడిగా కేటిఆర్ని అశీర్వదించుతున్నారని అన్నారు.సిరిసిల్ల అభివృద్దికి పట్టం కటినట్టు కనబడుతుందని అన్నారు. ఎగ్జిట్ పోల్స్ గతంలో తప్పుడు సమాచారం అందించడం జరిగిందని అన్నారు. 2014లో హంగ్ వస్తుందని అన్నారు. 2019లో బిఆర్ఎస్ అధికారంలో కి రాదని ఎగ్జిట్ పోల్స్ సర్వేలు చేప్పడం జరిగిందని అన్నారు. ప్రజలందరు బిఆర్ఎస్ పార్టీకి పక్షన ఉన్నట్లు తెలుస్తుందని అన్నారు. సిరిసిల్ల కు కేటిఆర్,సిఎం కేసిఆర్ అధికారంలోకి రావడం జరుగుతుందని అన్నారు. ప్రతిపక్షలు వారు గెలుస్తున్నమని తప్పుడు సమాచరం అందిస్తు ప్రజలను అయోమయంలోకి తీసుకపోతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి,చీటి నర్సింగరావు, బొల్లి రాంమోహన్,గూడురి ప్రవిణ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆల్ఫోర్స్ విద్యార్థుల విజ్ఞాన యాత్ర

సుల్తానాబాద్, ప్రభాతవార్త.



విద్యార్థులకు ప్రతి విషయంపై అవగాహన పెంచేందుకు అల్ఫోర్స్ విద్యా సంస్థలు ఎప్పుడూ ముందుంటున్నాయని ఆల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం సుల్తానాబాద్లోని ఆల్ఫోర్స్ పాఠశాలలో చదువుతున్న ఎల్కేజీ విద్యార్థులకు పాఠ్యాంశంలో భాగంగా సుల్తానాబాద్ రైల్వేస్టేషన్ను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రైల్వే స్టేషన్లో జరిగే తీరు తెన్నులను అధ్యాపకులు వివరించారు. దూర ప్రాంతాలకు వెళ్లే వారు ఒకేసారి వేల మందిని తరలించే అవకాశం రైలు ద్వారా ఉంటుందని అన్నారు. వేరే ప్రాంతాలకు సామాగ్రిని తరలించేందుకు గూడ్స్ రైలు ఉంటుందని, స్టేషన్లో మేనేజర్ సిబ్బంది చేసే పనులను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్తోపాటు అధ్యాపక బృందం, విద్యార్థినీ, విద్యార్థులు ఉన్నారు.

## పరకాలలో విజయం బిజెపిదే

### -మాజీ ఎమ్మెల్యే మొలుగూరి

పరకాల, డిసెంబర్ 1, ప్రభాతవార్త

టిఆర్ఎస్ అరాచక పాలనకు విసుగెత్తిన ప్రజలంతా బిజెపికి ఓటు వేశారని మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి అన్నారు. బిజెపి గెలుపుతో పరకాలను చక్కదిద్దుతామని భిక్షపతి హామీ ఇచ్చారు. శుక్రవారం బిజెపి పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, బిజెపి రాష్ట్ర నాయకులు దేవు సాంబయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ పెసరు విజయ చందర్రెడ్డి, డాక్టర్ సిరంగి సంతోష్కుమార్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మొలుగూరి మాట్లాడుతూ పరకాలలో ఎమ్మెల్యేగా బిజెపి అంతిమ విజయం సాధిస్తుందని అన్నారు. అస్తవ్యస్తంగా పరకాలను అభివృద్ధి పథంలో నడిపించే విధంగా బిజెపి పార్టీ కట్టుబడి ఉంటుందని అన్నారు. కాంగ్రెస్ బిఆర్ఎస్ పార్టీలను వ్యతిరేకిస్తూ ప్రజలు మార్పు కోరు కుంటున్నారని ప్రజలంతా బిజెపి పార్టీని గెలిపించేందుకు కృషి చేశారని అన్నారు. ఆ పార్టీలు ఎన్ని జిమ్ముక్కులు చేసినా ప్రజలు బిఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీలను నమ్మకుండా బిజెపి పార్టీ వైపే ఉన్నారని తెలిపారు. ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్ది బిజెపి పార్టీ పుంజుకుందన్నారు. బిజెపి పార్టీ గెలుపుకు కృషి చేసినా బిజెపి పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

## గాయపడ్డ వ్యక్తిని పరామర్శించిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల బ్యూరో,ప్రభాతవార్త :



జగిత్యాల పట్టణ 44వ వార్డుకు చెందిన శ్రీధర్ ప్రమాదవశాత్తు గాయపడగా వారిని పరామర్శించిన ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్,ఎమ్మెల్సీ ఎల్.రమణ.వెంట మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్,పట్టణ పార్టీ అధ్యక్షులు గట్టు సతీష్,బిఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

## బాలింత మృతి

జగిత్యాల టౌన్,ప్రభాతవార్త :



నర్సయ్య గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్త కోరండ్లకు చెందిన కొక్కుల లాస్య భర్త భూమేష్ 29-11-2023న పురిటి నొప్పులతో జగిత్యాలలోని మాతశిశు ఆసుపత్రిలో అడ్మిట్ అయింది.ఆపరేషన్ ద్వారా మగపిల్లాడు పుట్టాడు.తరువాత తీవ్ర రక్తస్రావం కావడంతో జగిత్యాల హాస్పిటల్ డాక్టర్స్ కరీంనగర్కి పంపాలని రిఫర్ చేయడంతో కరీంనగర్ గవర్నమెంట్ హాస్పిటల్కు తీసుకెళ్లారు.కానీ పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రతిమ హాస్పిటల్లో జాయిన్ చేయగా 30-12-2023న ప్రతిమ హాస్పిటల్లో చనిపోయింది.ఈ విషయం తెలిసిన కుటుంబ సభ్యులు,గ్రామస్తులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

## ఎయిడ్స్పై అవగాహన ర్యాలీ

ముత్తారం, ప్రభాతవార్త.

అంతర్జాతీయ ఎయిడ్స్ దేను పురస్కరించుకొని ముత్తారం మండల వైద్యాధికారి డాక్టర్ అమరేందర్రావు ఆధ్వర్యంలో ముత్తారం ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వైద్య సిబ్బందితో కలిసి ఆసుపత్రి నుంచి అడవీ శ్రీరాంపూర్ చౌరస్తా వరకు అవగాహన ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ అంటువ్యాధి కాదని, ఎయిడ్స్ పట్ల ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులను దూరం పెట్టకుండా అందరిలా వారిని కలుపుకొని ఉండాలని అన్నారు. మందు లేని మహమ్మారి ఎయిడ్స్ అని, ఎయిడ్స్ ను నివారణే తప్ప నిర్మూలన లేదని అన్నారు. ప్రతీ ఒక్కరూ ఎయిడ్స్ ను అరికట్టాలని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఈఓ నర్సింహా రెడ్డి, సూపర్ వైజర్ వీరేశం, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఫార్మాసిస్ట్ జగదీశ్వర్, ల్యాబ్ టెక్నీషియన్ అనిల్, స్టాఫ్ నర్స్ మంగ, కల్పన, సునీత, ఎఎన్ఎంలు స్రవంతి, రమాదేవి, ఆశా కార్యకర్తలుపాల్గొన్నారు.

## మార్పుకు ప్రజలు పట్టం కట్టారు

### -కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కేకే మహేందర్ రెడ్డి

సిరిసిల్ల టౌన్,ప్రభాతవార్త :



దేశ వ్యాప్తంగా సిరిసిల్ల ఎన్నికలపై చర్చ జరుగుతుందని ప్రజలందరు మార్పు కోరుకుటున్నారని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కేకే మహేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కేకే మాట్లాడుతూ ప్రజలు మార్పు కోరుకుటున్నట్లు తెలుస్తుందని అన్నారు. మంత్రిగా 10 సంంత్సరాలు,ఎమ్మెల్యేగా పరిపాలన చూసిన తరువాత మార్పు చేసుకోవాలని అన్నట్లు కనబడుతుందని అన్నారు.సిరిసిల్ల శాసన సభ ఎన్నికలను చరిత్రను సృష్టిస్తుందని అన్నారు.నిరుద్యోగులు,కొత్త ఓటర్లు, యువకులు,మహిళలు అందరు అనుకులంగా ఉన్నట్లు తెలుస్తుందని అన్నారు. ప్రత్యేకంగా పరోక్షంగా కాంగ్రెస్ పార్టీకి పని చేసిన వారికి, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు,నాయకులందరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సమావేశంలో మాజీ జిల్లా అధ్యక్షుడు నాగుల సత్యనారయణ, గడ్డం నర్సయ్య, పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, గోలి వేంకటరమణ, మడుపు శ్రీదేవి, కాముని వనిత,స్వరుప,వందన,చంద్రకళ,తిరుపతి రెడ్డి, సూర దేవరాజు, శివప్రసాద్, యెల్లే లక్ష్మీనారాయణ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ధర్మపురి నియోజకవర్గంలో పోలింగ్ 79.47 శాతం నమోదు

### వెల్గటూర్‌లో అధికం-ధర్మపురిలో అల్పం

ధర్మపురి,ప్రభాతవార్త :

అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా గురువారం నిర్వహించిన పోలింగ్ ప్రక్రియలో ధర్మపురి నియోజకవర్గంలో 79.47 శాతం పోలింగ్ నమోదైంది.ధర్మపురి నియోజకవర్గంలో 226800 ఓట్లు ఉండగా 179271 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు.నియోజకవర్గంలో ఏడు మండలాలు ఉండగా ధర్మపురి మండలంలో 47130 ఓట్లు ఉండగా 35814 మంది ఓటు వేశారు.వెల్గటూర్ మండలంలో 20899 ఓటర్స్ ఉండగా 17278 మంది ఓటు వేశారు.బుగ్గారం మండలంలో 17800 మంది ఓటర్స్‌కు 13651,గొల్లపల్లి మండలంలో 38348 ఓటర్స్‌కు గాను 30814 మంది తమ ఓటు హక్కును వినియోగిం చుకున్నారు.అలాగే పెగడపల్లి మండలంలో 35056 ఓటర్స్ ఉండగా 27692 మంది ఓటు వేయగా,ధర్మారం మండలంలో 44396 ఓటర్స్‌కు 36252 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.నియోజకవర్గంలోని మండలాల వారీగా వెల్గటూర్ మండలంలో అత్యధికంగా 82.67 శాతం పోలింగ్ నమోదు కాగా,ధర్మపురి మండలంలో అత్యల్పంగా 75.99 శాతం పోలింగ్ నమోదైంది.గురువారం పోలింగ్ ప్రక్రియ పూర్తి కాగానే రాత్రి వేళలో ఈవిఎంలను సామాగ్రిని పోలింగ్ కేంద్రాల నుండి తహశీల్ కార్యాలయానికి తరలించగా,ఓట్ల లెక్కింపు ప్రక్రియ కోసం శుక్రవారం ఉదయం నియోజకవర్గ ఎన్నికల అధికారి దివాకర్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తుతో జగిత్యాలలోని విఆర్‌కె ఇంజనీరింగ్ కాలేజిలోని స్ట్రాంగ్ రూమ్స్‌లోకి తరలించారు.ఇది ఇలా ఉండగా బారాస,కాంగ్రెస్ అభ్యర్థులు, నాయకులు కార్యకర్తలు గెలుపు పట్ల ఎవరికీ వారు తమ ధీమాను వ్యక్తం చేస్తున్నారు.

# ప్రజలు కాంగ్రెస్‌కు మద్దతు

### కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి,ప్రభాతవార్త :



రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు తెలంగాణకు మద్దతు ఇచ్చారని,తమ పార్టీ అధికారంలోకి వస్తుందని,అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీలు నిలబెట్టుకుంటామని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,ధర్మపురి నియోజకవర్గ ఎమ్మెల్యే కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.ధర్మపురి యొక్క కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కెసిఆర్ అవినీతి పాలనను అంతం చేయాలని ప్రజలు కోరుకున్నారని ఓటింగ్ సరళిని బట్టి తెలుస్తుందని అన్నారు.ఎన్నికల ప్రచారంలో భాగంగా నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్లిన ప్రజలు మద్దతు తెలుపుతూ,ఓటు వేస్తామని తనకు హామీ ఇచ్చారని వారికి రుణపడి ఉంటానని పేర్కొన్నారు.రెవెన్యూ డివిజన్ ఏర్పాటు విషయంలో మంత్రి కొప్పుల ఈశ్వర్ విఫలమయ్యారని,అలాగే బస్సు డిపో సైతం ఏర్పాటు చేయలేదని,ధర్మపురి క్షేత్రంలో ప్రతి ఏటా ప్రజలు మంచిని సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని వారి సమస్యను పరిష్కరించడంలో చర్యలు తీసుకోలేదని ఆరోపించారు.తనను ఓడించడానికి బారాసా నాయకులు విచ్చలవిడిగా డబ్బులు పంచారని ఆరోపించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 6 గ్యారెంటీ పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు శైలేంధర్‌రెడ్డి,నిశాంత్‌రెడ్డి,సింహరాజు ప్రసాద్,కస్తూరి శ్రీనివాస్,చిలుముల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సైపై డిఎస్పికి ఫిర్యాదు

ఇబ్రహీంపట్నం - ప్రభాతవార్త :

ఇబ్రహీంపట్నం ఎస్సై ఉమాసాగర్‌పై మెట్‌పల్లి డిఎస్పి రవీంధర్‌రెడ్డి శుక్రవారం మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన నల్ల సునీల్ శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఎన్నికల రోజు తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి దురుసుగా ప్రవర్తించి బూతులు తిడుతూ అట్రాసిటి కేసు పెడతానని బెదిరించడంతో ఈ విషయమై ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ కు వెళితే ఎస్సై అందుబాటులో లేదు. స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళ కానిస్టేబుల్ ఫోన్ ద్వారా ఎస్సైకి వివరించగా అదే ఫోన్‌లో ఎస్సై దురుసుగా మాట్లాడుతూ స్టేషన్ నుండి వెళ్ళిపోవాలని లేదంటే తొక్కుతానని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై ఎస్సైని వివరణ కోరగా పోలీస్ స్టేషన్‌కు 50 మందితో వచ్చాడాని అంతమందితో ఎందుకు వచ్చావని అందరిని బయటకు పంపి ఫిర్యాదు ఇచ్చి వెళ్ళమని చెప్పానని అంతకుమించి దురుసుగా ఏమి మాట్లాడలేదని తెలిపారు.

## అనారోగ్యంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉద్యోగి మృతి

మెట్‌పల్లి రూరల్ - ప్రభాతవార్త :



కథలాపూర్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న మెట్‌ఫల్లి మండలం రామలచ్చక్కపేట గ్రామానికి చెందిన ముదాం రవి(48) అనే వ్యక్తి ఆనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. రవి ప్రాంక్లియాసిస్ (కడపులో మంట) అనే వ్యాధితో నెల రోజుల క్రితం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేరి...చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచాడు. మృతుడు గతంలో రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి, కథలాపూర్, మేడిపల్లి, కోరుట్లలతో పాటు పలు మండలాల్లో విధులు నిర్వహించాడు. మంచి ఉద్యోగిగా సేవలు అందించిన రవికి హెల్త్ డిపార్ట్‌మెంట్, రెవెన్యూ డిపార్ట్‌మెంట్ అధికారులు పార్థీవా దేహానికి నివాళులర్పించారు. కాగా మృతునికి భార్య ముగ్గురు పిల్లలున్నారు.

## ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన

మెట్‌పల్లి అర్బన్ - ప్రభాతవార్త :



ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఎయిడ్స్ వ్యాధిపై సైకాలజిస్ట్ డా.రాజరత్నాకర్ సెమినార్ నిర్వహించి శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ మేరకు డా.రాజరత్నాకర్ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధికి చికిత్స లేదని నివారణ ఒక్కటే మార్గమని ఇది నిజమని అవగాహన కల్పించారు. అనంతరం ఎయిడ్స్‌పై కరపత్రం అవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సైకాలజిస్ట్ డా.రాజరత్నాకర్, గట్టయ్య, దశరథం,మధు, గణేష్, శ్రీనివాస్, నాగేశ్వరాచారి, అమీనా, ఫాతిమా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ముత్యంపేట గ్రామ శివారులో కారు, బైక్ ఢీ

మెట్‌పల్లి టౌన్ - ప్రభాతవార్త :



మల్లాపూర్ మండలం లోని ముత్యంపేట గ్రామ శివారులో శుక్రవారం కారు, ద్విచక్ర వాహనం ఎదురెదు రుగా ఢీకొన్నాయి. ఇట్టి ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలవ్వగా...కారులో ఉన్న జగిత్యాల జిల్లా కోరుట్ల క్లస్టర్ ఆఫీసర్ ఎపిడిఓ బాలే శివాజి నడు ముకి గాయమైనట్లు స్థాని కులు తెలిపారు. కాగా క్షతగాత్రులను చికిత్స నిమి త్తం మెట్‌పల్లి పట్టణంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

# జగిత్యాల వార్త



## అన్యాయాన్ని లోకానికి చాటడానికే నామినేషన్ వేశా

### -అసెంబ్లీ స్వతంత్ర్య అభ్యర్థిని చిటి శ్యామల

జగిత్యాల బ్యూరో,ప్రభాతవార్త :



నా పెద్ద కొడుకు ద్వారా తనకు జరిగిన అన్యాయాన్ని లోకానికి చాటడానికే జగిత్యాల అసెంబ్లీ బరిలో స్వతంత్ర్య అభ్యర్థిగా నామినేషన్ వేశానని ఎవరికి నష్టం కలిగించడం నా ఉద్దేశం కాదని ఎమ్మెల్యేగా నామినేషన్ వేసిన చిటి శ్యామల అన్నారు.శుక్రవారం జగిత్యాల ప్రెస్‌క్లబ్ సమీపంలో మీడియాతో మాట్లాడారు.తన సమస్యను లోకానికి చాటడానికే నామినేషన్ వేయడం జరిగిందని మీడియా సహకారంతో దేశ విదేశాల్లో నుంచి మద్దతు దొరికిందని శ్యామల చెప్పారు.నా సమస్యను జరిగిన అన్యాయాన్ని లోకానికి చాటిన జగిత్యాల ప్రింట్,ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులకు శ్యామల కృతజ్ఞతలు తెలిపారు.డబ్బు,పలుకుబడి కలిగిన తన పెద్ద కొడుకు మూలంగా నాకు జరిగిన అన్యాయం,కోర్టు కేసుల అంశం ప్రజలకు,పాలకులకు,అధికారులకు తెలియజేయడమే నామినేషన్ ప్రధాన ఉద్దేశ్యమని శ్యామల చెప్పారు.కేవలం నామినేషన్ వరకే పరిమతమైనదని ఎటువంటి ప్రచారాలకు పోలేదని పోటీలో ఉన్న ఎవరికి నష్టం కలిగించడం తమ ఉద్దేశం కాదని చీటి శ్యామల చెప్పారు.తన సమస్యను ప్రపంచానికి చాటిన జగిత్యాల మీడియా మిత్రులకు మరోసారి శ్యామల కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల జగిత్యాలలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ అవగాహన సదస్సు

జగిత్యాల బ్యూరో,ప్రభాతవార్త :



స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల జగిత్యాలలో ప్రపంచ ఎయిడ్స్ అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది.జాతీయ సేవా పథకం,మహిళా సాధికారత విభాగం,హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ఇంచార్జీ ప్రిన్సిపల్ అసోసియేట్ ప్రొ.ఎ.జ్యోతిలక్ష్మి మాట్లాడుతూ చికిత్స కన్నా నివారణ మార్గమే మేలని,ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు విద్యార్థులు ఎయిడ్స్ గురించి అవగాహన కలిగి ఉండాలని,విస్తృతంగా సమాజంలో అవగాహన కల్పించాలని,ఎయిడ్స్ వ్యాధి గురించి నిజా నిజాలు వివరించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ జగిత్యాల జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ పడాల తిరుపతి,మాజీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్.కె.కిరణ్‌మై,మహిళా సాధికారత విభాగ కన్వీనర్ స్వరూప రాణి,జ్యోత్స్న,ఇర్భానా,సంగీత,వీణ, వెంకటసాయి, సంతోష్,లక్ష్మి,నరసయ్య,నర్సింగరావు,ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# స్ట్రాంగ్ రూంలకు ఈవిఎం యంత్రాల తరలింపు పూర్తి

**- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్**




**పెద్దపల్లి, ప్రభాతవార్త:** స్ట్రాంగ్ రూంలకు ఈవిఎం యంత్రాల తరలింపు పూర్తయిందని జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. శుక్రవారం రామగిరి మండలంలోని జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రం స్ట్రాంగ్ రూంలలో యంత్రాల తరలింపు ప్రక్రియను రామగుండం అసెంబ్లీ నియోజక వర్గ సాధారణ పరిశీలకులు రాజేష్ సింగ్ రాణా, పెద్దపల్లి, మంథని అసెంబ్లీ నియోజక వర్గాల సాధారణ పరిశీలకులు శ్రీధర్‌లతో కలిసి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంథని నియోజక వర్గంకు సంబంధించిన ఈవిఎం యంత్రాలను గురువారం రాత్రి స్ట్రాంగ్ రూంలలో భద్ర పరిచామని, పెద్దపల్లి, రామగుండం అసెంబ్లీ నియోజక వర్గాలకు సంబంధించిన ఈవిఎం యంత్రాలను శుక్రవారం ఉదయం స్ట్రాంగ్ రూంలకు తరలించి భద్రత పరిచామని తెలిపారు. ఈవిఎం యంత్రాలు స్ట్రాంగ్ రూంకు తరలింపు ప్రక్రియ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జరిగిందని, ఎన్నికల కమీషన్ నిబంధనల ప్రకారం పారదర్శకంగా యంత్రాలను తరలించామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారులు జె.అరుణశ్రీ, సిహెచ్.మధుమోహన్, వి.హనుమ నాయక్, సంబంధిత అధికారులు, తదితరులున్నారు.

# ఎయిడ్స్‌పై అవగాహనతో ప్రజలలో చైతన్యం కలిగించాలి

**- సీనియర్ సివిల్ జడ్జి ఎం.అర్జున్**




**పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:** హెచ్ఐవి ఎయిడ్స్‌పై అవగాహనతో ప్రజలలో చైతన్యం కలిగించాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం.అర్జున్ అన్నారు. శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఆసుపత్రి నుంచి ప్రధాన కూడలి గుండా మండల పరిషత్ కార్యాలయం వరకు నిర్వహించిన ర్యాలీని సీనియర్ సివిల్ జడ్జి ఎం.అర్జున్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి ఎం.అర్జున్ మాట్లాడుతూ జాతీయ సగటు కంటే తెలంగాణలో హెచ్ఐవి కేసులు నమోదు అధికంగా ఉందని, అందుకు ఈ వ్యాధిపై అవగాహన పెంచుకోవాలని, ప్రజలలో చైతన్యం కలగాలని, యువత టాటూ వేయించుకునే సమయంలో హెచ్ఐవి సోకకుండా జాగ్రత్త వహించాలని కోరారు. ర్యాలీ అనంతరం నిర్వహించిన సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ వివిధ కార్యక్రమాల ద్వారా ఎయిడ్స్ నివారణ పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. లెట్ కమ్యూనిటీ లీడ్ నినాదంతో ఈ సంవత్సరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాకాంత్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆశాలు, వివిధ స్థానిక కళాశాలల విద్యార్థులు పాల్గొనగా, సాంస్కృతిక సారథి కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారు.

# అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపుకు పకడ్బందీ ఏర్పాట్లు

**- ఈవిఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూంల వద్ద భారీ భద్రత**

**- రేపు ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం**

**- ఈవిఎంలలో నిక్షిప్తమైన అభ్యర్థుల భవితవ్యం**




**సిరిసిల్ల బ్యూరో, డిసెంబర్ 01, ప్రభాతవార్త :** రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఈ నెల 3న అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు సజావుగా జరిగేందుకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి గ్రామంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాలకు సంబంధించి ఓట్ల లెక్కింపును చేపట్టనున్నారు. జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఈవిఎంలలో నిక్షిప్తమైన అభ్యర్థుల భవితవ్యం ఈ నెల 3న తేలిపోనుంది. ఆ రోజు ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. అదే రోజు సాయంత్రానికి పూర్తి ఫలితాలు వెల్లడి కానున్నాయి. ఆదివారం జరగనున్న ఓట్ల లెక్కింపు కోసం ఎన్నికల సంఘం మార్గదర్శనాల మేరకు అధికారులు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేశారు. సిరిసిల్ల, వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గాలకు బద్దెనపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో లెక్కింపు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రెండు నియోజకవర్గాలకు అదే పాఠశాలలో వేరు వేరుగా కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక్కో నియోజకవర్గంలో 14 ప్లస్ 1 చొప్పున టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ముందస్తుగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు లెక్కించనున్నారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గంకు 3 టేబుళ్లు ఏర్పాటు చేసి ఒకే రౌండ్‌లో లెక్కింపు పూర్తి చేస్తారు. సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గంకు 4 టేబుళ్లు ఏర్పాటు చేసి ఒకే రౌండ్‌లో లెక్కింపు పూర్తి చేయనున్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం కౌంటింగ్ హాలులో 14 టేబుళ్లను ఏర్పాటు చేయనున్నారు. ప్రతి టేబుల్ వద్ద కౌంటింగ్ సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రో అబ్జర్వర్ ఒక బృందంగా విధులు నిర్వహిస్తారు. సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గంలో 21 రౌండ్లు, వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గంలో 19 రౌండ్లలో ఈవిఎంలలోని ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తి చేస్తారు. ఈవిఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూంల వద్ద భారీ భద్రత ఏర్పాట్లు చేశారు. గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈవిఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూముల వద్ద స్థానిక పోలీసులు, ఆర్మ్‌డ్ రిజర్వ్, కేంద్ర బలగాలతో బందోబస్తును ఏర్పాటు చేశారు. ఎన్నికల కమిషన్ అనుమతి ఉన్న వారికే స్ట్రాంగ్ రూంలలోకి అనుమతి ఇస్తున్నారు. స్ట్రాంగ్ రూంల వద్ద 24 గంటల పాటు పటిష్ఠ భద్రతను ఏర్పాటు చేశారు. కాగా రెండు నియోజకవర్గాలలో తుది పోలింగ్ శాతం తేలింది. సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గంలో 77 శాతం, వేములవాడ నియోజకవర్గంలో 78.42 శాతం పోలింగ్ నమోదైంది. సిరిసిల్ల నియోజవర్గంలో మొత్తం 2,44,426 ఓట్లు ఉండగా 1,88,202 ఓట్లు పోలయ్యాయి. ఇందులో 30,110 మంది పురుషులు, 98,088 మంది మహిళలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. వేములవాడ నియోజకవర్గంలో 2,22,251 ఓట్లుండగా 1,74,300 ఓట్లు పోలయ్యాయి. ఇందులో 78,240 మంది పురుషులు, 96,049 మంది మహిళలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. స్ట్రాంగ్ రూంలలో ఉన్న ఈవిఎంలలో పోటీ చేసిన అభ్యర్థుల భవితవ్యం నిక్షిప్తమై ఉన్నది. సిరిసిల్లలో 21 మంది, వేములవాడలో 16 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. సిరిసిల్ల నియోజవర్గంలో బిఆర్ఎస్ అభ్యర్థి కెటిఆర్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కెకె మహేందర్ రెడ్డి, బిజెపి అభ్యర్థి రాణి రుద్రమలు పోటీ చేశారు. వేములవాడలో బిఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీ నర్సింహారావు, కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్, బిజెపి అభ్యర్థి చెన్నమనేని వికాస్ రావులు పోటీలో ఉన్నారు. ప్రధాన పార్టీల మధ్య పోటాపోటీ నెలకొనడంతో ఉత్కంఠ నెలకొంది.

# రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ





**వేములవాడ, ప్రభాతవార్త:** దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో కార్తీక శుక్రవారం కావడంతో భక్తుల రద్దీ పెరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణాలన్ని కిక్కిరిసిపోయాయి. భక్తులు పవిత్ర ధర్మగుండంలో పుణ్య స్నానాలు ఆచరించి నిలువెత్తు బంగారం, కోడె మొక్కులు, సత్యనారాయణ వ్రతాలు చేయించుకొని క్యూలైన్ ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు. దర్శనానికి నాలుగు గంటల సమయం పట్టింది. భక్తులకు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

**పునర్వసు నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు...** కార్తీక మాసం పునర్వసు నక్షత్రం కావడంతో శుక్రవారం ఆలయంలో స్వామివారికి అర్చకులు ప్రత్యేక పూలు చేశారు. ఉదయం శ్రీ స్వామివారికి మహాన్యాసన పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతార్చనలు, సాయంత్రం సదస్యం గావించారు. పునర్వసు నక్షత్రం కావడంతో ప్రత్యేక పూజల కారణంగా ఉదయం 9గంటల వరకు భక్తులను అభిషేకాలకు అనుమతించలేదు.

## జిల్లాలో 77.96శాతం పోలింగ్ నమోదు

**- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**



**పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:** నవంబర్ 30న గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో 77.96శాతం పోలింగ్ నమోదు అయినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి అసెంబ్లీ నియోజక వర్గ పరిధిలో 2లక్షల 54వేల 266 మంది ఓటర్లు ఉండగా, పోలింగ్ నందు 2లక్షల 7వేల 397 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని, 81.57శాతం పోలింగ్ నమోదైందని కలెక్టర్ తెలిపారు. రామగుండం అసెంబ్లీ నియోజక వర్గ పరిధిలో ఉన్న 2లక్షల 21వేల 19 మంది ఓటర్లు ఉండగా, పోలింగ్ నందు లక్షా 51వేల 865 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని, 68.71శాతం పోలింగ్ నమోదైందని తెలిపారు. మంథని నియోజక వర్గ పరిధిలో 2లక్షల 36వేల 442 మంది ఓటర్లు ఉండగా, పోలింగ్ నందు ఒక లక్షా 95వేల 635 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని, 82.74శాతం పోలింగ్ నమోదైందని తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో 3అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలో మొత్తం 7లక్షల 11వేల 727 మంది ఓటర్లు ఉండగా, గురువారం జరిగిన ఎన్నికల పోలింగ్‌లో 5లక్షల 54వేల 897 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని, 77.96శాతం పోలింగ్ నమోదైందని కలెక్టర్ పేర్కొన్నారు.

## టవర్ సర్కిల్ వద్ద బండి సంజయ్ సందడి

**కరీంనగర్ టౌన్,ప్రభాతవార్త:** అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన అనంతరం బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ శుక్రవారం కరీంనగర్ టవర్ సర్కిల్‌లో పర్యటించారు. అక్కడ ఉన్న ఓ జిలేబి సెంటర్ వద్ద బీజేపీ నాయకులు, కార్యకర్తలతో సరదాగా గడిపినట్లు ఒక ప్రకటనలో ఎంపీ కార్యాలయ సిబ్బంది తెలిపారు. సామాన్య ప్రజలలాగా బండి సంజయ్ అక్కడికి రావడంతో పలువురు షాప్ యజమానులు, ప్రజలు తనను కలవడానికి వచ్చారు. ఈ సందర్భంగా వారి అందరిని ఆప్యాయంగా పలకరిస్తూ, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల ప్రచారంలో నిన్నటి వరకు బిజీ బిజీగా గడిపిన సంజయ్ కుమార్, నేడు కాస్త ఫ్రీ టైం దొరకడంతో ఇలా సేద తీరారు.

